

అప్రమత్తతే ఆయుధం

వర్షాభావ పరిస్థితుల వల్ల ఉద్యాన పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి.రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐజే మైఖెల్ రాజీవ్ తెలిపారు. -8లో



భర్త చేతిలో భార్య హతం

భర్త చేతిలో భార్య హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి రాయచోటి పట్టణ శివార్లలో చోటు చేసుకుంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.80	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 428 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	456
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 452.100 కిలోలు

న్యూస్‌రీల్

17న జిల్లా నిఘా కమిటీ సమావేశం

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటిలో ఈనెల 17న కలెక్టర్ గిరీషా పీఎస్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షక కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని, జిల్లాలోని నిఘా, పర్యవేక్షక కమిటీ సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

17 నుంచి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

రాయచోటి టౌన్: చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఈ పోటీలకు హాజరు కావాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. పీఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ జక్రియా బాషా, చిట్వేలి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి, పీఎస్‌టీయూ నాయకులు ఎస్ఎండీ గౌస్, హబీబుర్ రహిమాన్ ఆహ్వానపత్రిక అందజేసినవారిలో ఉన్నారు.

15 నుంచి వారోత్సవాలు

రాయచోటి అర్బన్: ఈనెల 15వతేది నుంచి 21వ తేది వరకు జరగనున్న జాతీయ నవజాత శిశువారోత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య, జిల్లావ్యాధి నిరోధక టీకాల అధికారిణి ఉషశ్రీ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.2000వ సంవత్సరం నుంచి ప్రతియేడాది నవంబరు 15 నుండి 21 వతేది వరకు నవ జాత శిశువారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. నవజాత శిశువు జీవిత కాలాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించే దిశగా తల్లులు,కుటుంబ సభ్యులను చైతన్యవంతులను చేయడమే కార్యక్రమం ముఖ్య లక్షణమన్నారు. సచివాలయాల పరిధిలోని నవజాత శిశువుల ఇళ్లను ఆశాకార్యకర్తలు, ఆరోగ్యమిత్రలు, సమాజ ఆరోగ్య అధికారులు విధిగా సందర్శించాల్సి ఉంటుందన్నారు. తమ పరిధిలోని నవజాత శిశువుల జాబితాను తయారు చేయాలన్నారు. పిల్లల పెంపకం తదితర అంశాలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించాలన్నారు.

సచివాలయం పరిశీలన

చెన్నూరు: కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్ శిక్షణ అధికారుల బృందం సభ్యులు గురువారం మండలంలోని బయన పల్లె గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏయే సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. సభ్యులు రోహిత్, భరత్ బ్రిజేష్ ,సతీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుస్తున్న పసుపు ధర

కడప అగ్రికల్చర్: పసుపు ధర మెరుస్తోంది. గత కొద్ది రోజులుగా క్వింటా రూ. 10 వేలు పైనే పలుకుతోంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కడప మార్కెట్ యార్డులో క్వింటా ఫింగర్ పసుపు అత్యల్ప ధర 9289 ఉండగా అత్యధికం రూ. 10489 పలికింది. బల్బు రకం అత్యల్ప ధర క్వింటా రూ. 6445, అత్యధిక రూ. 10389 పలికింది.

18న ప్రత్యేక సమావేశం

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష 2024–25, 2025–26 వార్షిక ప్రణాళిక తయారీ చేసే విషయంపై ఈనెల 18వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లుగా డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. కడప శంకరాపురం జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ మీటింగ్ హాల్‌లో సమావేశం ప్రారంభమవుతందన్నారు.

రైళ్లు దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: పూణె–కన్యాకుమారి–పుణె (16381/82) మధ్య నడుస్తున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు దారి మళ్లించారన్నారు. పాకాల, ధర్మవరం, గుత్తిమీదుగా వెళుతుందన్నారు. ముద్దనూరు–కలమల్ల రైల్వే మార్గంలో రైల్వే కారిడార్ పనులు జరుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

- మధురై–ఓకా (09519) వారాంతపు రైలును ఈనెల 24వ తేదీ వరకు దారి మళ్లించారన్నారు. రైల్వే కారిడార్ పనుల వల్ల కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా నడుస్తుందన్నారు.
- తిరుపతి–రేణిగుంట మార్గంలో రోలింగ్ కారిడార్ పనులు జరుగుతున్న కారణంగా కడప–అర్కోణం–కడప (06401/402) అర్కోణం ప్యాసింజర్ రైలు మరో వారం రోజులపాటు రద్దు చేసినట్లు జనార్దన్ తెలిపారు.

శుభ్రతలో కొత్త ఒరబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా టాయిలెట్ల నిర్వహణ
- క్రమం తప్పకుండా క్లీనింగ్ సామగ్రి సరఫరా
- జిల్లాలో 2,270 మంది ఆయాల సేవలు



మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న ఆయా

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బడుల్లో స్వచ్ఛత మెరుగైంది. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా బడి శుభ్రంగా దర్శనమిస్తోంది. ప్రభుత్వ విప్లవాత్మక మార్పులతో విద్యా ప్రమాణాలు పెరగడంతో పాటు మౌళిక వసతులు మధ్య విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వసతుల కల్పనలో టాయిలెట్ల నిర్వహణపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు నేడు క్లీన్‌గా ..నీటుగా దర్శనమిస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2,213 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,54,789 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల పరిసరాల పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు 300 మంది విద్యార్థుల వరకు ఒకరు, 301 నుంచి 600 విద్యార్థులుంటే ఇద్దరు, 601 నుంచి 900 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు, 900 మంది విద్యార్థులకు పైగా ఉంటే నలుగురు ఆయాలను నియమించారు. ఈ విధంగా జిల్లాలో 2,270 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం అందజేస్తున్నారు. ఉదయం పాఠశాలకు విద్యార్థులు వచ్చేసరికి ఆయాలు టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ చొరవను విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు.
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు బాత్‌రూమ్ క్లీనర్ ద్రావణం, ఎయిర్ ఫ్రెష్నర్ ద్రావణాన్ని ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసింది. దీంతో పాటు పాఠశాలలకు అవసరమైన బాత్‌రూం బకెట్లు, జగ్గులు, చెత్త సేకరణకు అనువైన బక్కెట్లు, స్ప్రే బాటిళ్లు, బ్రెస్‌లు, ఆయాలకు సేఫ్టీ జాకెట్లు, గౌసలు అందించారు. పాఠశాల ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండడంతో బడి ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.

నాడు ఇబ్బందులు

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉంటే నీళ్లుండేవి కావు. నీళ్లు ఉంటే తలుపులుండవు. రెండూ ఉన్నా నిర్వహణ లేక కంపు కొడుతుండటంతో వెళ్లలేని దుస్థితి. అత్యవసర పరిస్థితుల్లో చెట్ల పొదలు, గోడల చాటే గతి. పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో చదువుకు స్వస్తి పలికిన బాలికలు గ్రామాల్లో చాలా మంది ఉన్నారు. అక్కడక్కడ అరకొర ఆయాలను నియమించినా ఏడాదికోసారి వేతనాలు ఇస్తుండటంతో పాటు శుభ్రతకు ఎలాంటి సామాగ్రి, రసాయనాలు ఇవ్వకపోడంతో పెద్ద ఫలితం ఉండేది కాదు.

నేడు సౌకర్యాలు

సౌకర్యాల నడుమ పేద విద్యార్థులు చదువులు కొనసాగించాలనే లక్ష్యంలో సీఎం వై.ఎస్.జగన్ చేపట్టిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలను తలపిస్తున్నాయి. శుభ్రమైన ఆధునిక టాయిలెట్లు కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులను, టాయిలెట్‌లను నిత్యం శుభ్రంగా ఉంచేందుకు ఒక్కో పాఠశాలకు ఒకరి నుంచి నలుగురు ఆయాలను నియమించారు. ఒక్కో ఆయాకు నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం ఇస్తున్నారు. దీంతో పాఠశాలల్లో డ్రాపౌట్స్‌శాతం తగ్గతూ వస్తోంది.

వాష్ రూంలు బాగున్నాయి:



చిన్నప్పటి నుంచి గర్నమెంటు స్కూల్‌లోనే చదువుకుంటున్నాను. గతంలో వాష్ రూములు బాగా ఉండేవి కావు. బయలు మైదానాలకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం బాత్‌రూములు బాగున్నాయి. చాలా శుభ్రంగా ఉన్నాయి. – ఇమ్రాన్, 8వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణను కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. టాయ్‌లెట్లు, రెస్టు రూముల సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా వా టి నిర్వహణకు పెద్ద మొత్తంలో ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. – శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

నిత్యం పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడు,బాత్‌రూములతో పాటు పాఠశాలల పరిశుభ్రంగా ఉండేలా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఆయాలకు కావాల్సిన వస్తువులు సకాలంలో అందిస్తున్నాం. –పి.నరసింహులు, ఏడీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. గురువారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటర్ల జనాభా నిష్పత్తి, లింగ నివృత్తి , ఓటర్ల నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి ఫారం–6 పెండింగ్ 25 శాతం, ఫారం–7 పెండింగ్ 15 శాతం, ఫారం–8 పెండింగ్ 10 శాతం ఉందన్నారు. పెండింగ్ దరఖాస్తులను ఎలక్టోరల్ అధికారులు, తహసీల్దార్లకు తగు ఆదేశాలు జారీ చేశమన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యర్థనలు, తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ రంగస్వామి, కలెక్టరేట్ ఎస్‌డీసీ శ్రీలేఖ, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

మహిళలు, చిన్నపిల్లలలో అనీమీయా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించిన సమీక్ష కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య, డీఈఓ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనతలోపం ఉన్న గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సరియైన పోషకాహారం అందించి రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ పరిధిలో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే వందశాతం పూర్తి చేయాలన్నారు.

‘పది’ పరీక్షలపై దృష్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పాఠ్య పుస్తకాల ముద్రమణ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి

నందలూరు (రాజంపేట) : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పదోతరగతి పరీక్షలపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర పాఠ్యపుస్తకాల ముద్రణ డైరెక్టర్ కె రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం నందలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాఠ్యపుస్తకాలపై సమావేశం నిర్వహించి లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి దశరథ రామిరెడ్డి, పాఠ్యపుస్తకాల గోడౌన్ ఇన్‌చార్జ్, మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంత కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : విధి నిర్వహణలో పోలీసు ప్రతిష్టకు భంగం కలిగించిన వారెవరైనా చర్యలు తప్పవని ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన నెల వారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు భద్రతా భావం , భరోసాతో జీవించేలా పోలీసులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కింది స్థాయి అధికారులకు ఆదేశించారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. వారిని పాత పంతా వైపు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని, రాత్రి సమయంలో గస్తీనీ మరింత పటిష్టం చేయాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడేందుకు దోహదం చేసే నేరస్థుల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు , ఛార్జీషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఫ్యాక్షన ప్రభావితం , సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగులకు తావుండకూదని ఘాటుగా హెచ్చరించారు.

నాటు సారా రహిత జిల్లాగా....

జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్నిచర్యలు క్రింది స్థాయి అధికారులు దృష్టి సారించాలని, వీటి నియంత్రణలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘాను పెంచాలన్నారు. అవినీతి కార్యకలాపాలకు దూరంగా పోలీసులు ఉండాలని, పోలీసు ప్రతిష్ట దిగజార్చే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, ఎస్‌డీపీఓలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2న మెగా జాబ్ మేళా

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఇతర నాయకులు, అధికారులు

రాయచోటిటౌన్: డిసెంబర్ 2వ తేదిన రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రాయలసీమ జోన్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో కలసి విలేకరులతో మాట్లాడారు. రాయచోటి ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేవని కేవలం విద్య ద్వారానే ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళుతున్నారన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 2వ తేదిన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో పది వేల మందికి ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా రీజనల్ స్థాయి మెగా జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పీజీ, టెక్నికల్ కోర్సులు, పాలిటెక్నికల్, నర్సింగ్, ఫార్మసీ. ఒకేషనల్ కోర్సులు చదివిన అభ్యర్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుండుపల్లె రహదారిలో ఏపీఐఐసీకి 600 ఎకరాలు మరో ప్రాంతంలో పీజీ కళాశాలకు 60 ఎకరాలు యునానీ కళాశాలకు 10 ఎకరాల భూమిని సేకరించి ముందు చూపుతో ఉన్నామన్నారు. జాబ్ మేళలో ఎంపిక చేసిన తరువాత అక్కడే నియమకం పత్రాలు కూడా ఇస్తారని తెలిపారు. వివిధ స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి రూ50 వేల వరకు జీతాలు పొందే అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ రీజనల్ మేనేజర్ శ్యాంమోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, ఎంపీడీవో మల్‌రెడ్డి, నరసింహులు, దివ్య, ఇన్‌చార్జీలు పట్నాయక్, జాబీర్ అహమ్మద్, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఇంతియాజ్, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్, ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్‌పై సంపూర్ణ హక్కు

- 20 ఏళ్ల కిందట అసైన్డ్ భూములు కొన్నవారికి పూర్తి స్వేచ్ఛ
- ఇప్పటికే చుక్కలు, ఇనాం, పాత డీకేటీలకు మోక్షం కల్పించిన ప్రభుత్వం
- నేడు స్పందన హాలులో కలెక్టర్ చేతుల మీదుగా పేదలకు పట్టాభిషేకం



ప్రతీకాత్మక చిత్రం

సాక్షి రాయచోటి : భూములు ఉన్నా...పంట పండిస్తున్నా పేరుకు మాత్రమే రైతుల పేరుతో ఉన్నా వాటిపై అమ్ముకునేందుకు గానీ, కొనేందుకుగానీ వీలు లేని పరిస్థితి. ,ప్రభుత్వాలు మారినా...నేతలు మాత్రం పేదల తలరాత మార్చలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ పేదల పక్షపాతిగా నిలుస్తూ అన్నింటా సౌకర్యాలు కల్పిస్తున్నారు. రెవెన్యూ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టంగా నిలిచి పోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే చుక్కల భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇనాం భూములకు స్వేచ్ఛ ఇచ్చారు. తాజాగా 20 ఏళ్లుగా అసైన్డ్ భూములను అనుభవిస్తూ...అధికారం లేక అల్లాడిపోతున్న అన్నదాతలకు పూర్తి హక్కులు కల్పిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 93,435 మందికి ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో 20 ఏళ్ల కిందట అంటే 2003కు ముందు నుంచి అసైన్డ్ భూములు అనుభవిస్తున్న వారికి ప్రయోజనం చేకూరనుంది. అందులో భాగంగా ఎవరి పేరున భూమి ఉందో వారి పేరున పూర్తి స్థాయిలో క్రయ విక్రయాలకు అవకాశం కల్పిస్తూ జీఓ జారీ చేసింది. 20 ఏళ్ల కిందట నుంచి భూములు సాగు చేస్తూ అసైన్డ్ రైతులుగా గుర్తింపు పొందిన 93,435 మంది రైతులకు సంబంధించి 1,45,243.33 ఎకరాల భూములను రైతులకు పూర్తి స్థాయిలో అప్పగించనున్నారు.

నేడు రాయచోటిలో కార్యక్రమం

అసైన్డ్ భూములు కొన్నవారికి పూర్తి స్వేచ్ఛ కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం ముగిశాక జిల్లాకు సంబంధించి అసైన్డ్ భూ ములు కలిగిన అన్నదాతలకు పూర్తి హ క్కులకు సంబంధించిన పత్రాలను కలెక్టర్, ప్రజాప్రతినిధులు అందజేయనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అన్నమయ్య జిల్లాలో ఎన్నో ఏళ్ల కిందట అర్హులుగా ఉండి కూడా అధికారం లేక అల్లాడిపోతున్న రైతులకు సీఎం చేతుల మీదుగా పూర్తిస్థాయిలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు లక్షలాది ఎకరాల భూములు అప్పగిస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకుని లాభాల బాటలో పయనించాలి. – పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

మాతాశిశు సంరక్షణకు కృషి



ఆశ నోడల్ అధికారులతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: గర్భిణులను నమోదు చేసినప్పటి నుండి కాన్పువరకు వారికి అందించే సేవలను ఆరోగ్యకార్యకర్తలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మాతా శిశు సంరక్షణకు కృషి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.కొండయ్య అన్నారు. గురువారం స్థానిక డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆశ నోడల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గర్భిణిని 22 వారాల లోపు నమోదు చేసి కాన్పులోపు నాలుగుసార్లు పరీక్షలు నిర్వహించాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను గర్భిణులు తప్పకుండా వినియోగించుకునేలా ఆశ,ఆరోగ్యకార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి ఉషశ్రీ మాట్లాడుతూ 5 సంవత్సరాలోపు పిల్లల్లో ఎక్కువగా వచ్చే న్యూమోనియా వ్యాధి నివారణకు నవంబరు 12నుండి ఫిబ్రవరి 8వతేది వరకు తల్లులకు అవగాహణ కార్యక్ర మాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ నారాయణ మాట్లాడారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, జిల్లా ఆశనోడల్ అధికారిణి శ్రీవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, వివిధ మండలాలనుండి వచ్చిన హెల్త్ సూపర్‌వైజ‌లు, పబ్లిక్‌హెల్త్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో అనసూయ సందడి

- ఘనంగా ఎంజీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం



షాపింగ్ మాల్‌లో రంగు రంగుల చీరలతో సందడి చేస్తున్న యాంకర్ అనసూయ

రాయచోటి: పట్టణంలోని ఎంజీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో యాంకర్ అనసూయ సందడి చేశారు. రాయచోటిలో గురువారం ఎంజీఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ ఎదుట ప్రదర్శన చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాయచోటిలో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనసూయను చూసేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు.

షాపింగ్ మాల్స్ ఏర్పాటు హర్షనీయం

అన్నమయ్య జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్ ఏర్పాటు కావడం హర్షనీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాషతో కలిసి ముఖ్య తిథిగా ఎమ్మెల్యేశ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

జనవాక్కు

సొంతిల్లు వచ్చింది



గతంలో నాకు మట్టి మిద్దె ఉండేది. వర్షం వస్తే ఇంటిలో ఉండే పరిస్థితి లేదు. చాలా ఇబ్బందులు పడేవారం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాం. – బచ్చు శ్యామల, గాదెగూడూరు , రాజుపాళెం మండలం

ఉపాధ్యాయులకు పెరిగిన గౌరవం



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ కారణంగా ఉపాధ్యాయులపట్ల విద్యార్థులు, తల్లిదండ్రులలో గౌరవం పెరుగుతోంది. నాడు–నేడుతో బడుల రూపురేఖలే మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు పేద, మధ్యతరగతి వర్గాల వారు సైతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునే వారు. ఈ ప్రభుత్వం వచ్చాక మంచి భోజనం, దుస్తులు, పుస్తకాలు, విశాలమైన గదులు, ఫర్నిచర్ అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులపై నమ్మకం పెరిగింది. – కె.శ్రీనివాసులు, ఎస్‌జీటీ, అరవీటివాండ్లపల్లె, గాలివీడు మండలం

కుల ధ్రువీకరణ పత్రం ఊర్లోనే వచ్చింది



వైఎస్సార్ చేయూత పథకం కోసం గ్రామ సచివాలయంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్కరోజులో సర్టిఫికెట్ చేతికి వచ్చింది. గత ఏడాది ఈ సర్టిఫికెట్ కోసం చాపాడు మండలానికి వారం రోజులు తిరిగినా రాలేదు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా మా ఊర్లోనే సర్టిఫికెట్ ఇచ్చారు. ఇది జగనన్న చేసిన మేలు. నాకెంతో సంతోషంగా ఉంది. – గొడుగు జ్యోతి, అల్లాడుపల్లె, చాపాడు మండలం

రేషన్‌కార్డు వచ్చింది



టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కోసం నిత్యం తహసీల్దార్ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగాం. అయిన రేషన్ కార్డు రాలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే మా కుటుంబంలోని ముగ్గురికి రేషన్ కార్డులతో పాటు, ఇంటి స్థలాలు, పక్కా గృహం మంజూరైంది. అలాగే మా బిడ్డలకు అమ్మ ఒడి పథకం అందడంతో పాటు బడిలో పౌష్టికాహారం ఇస్తున్నారు. మా భర్తకు వాహన మిత్ర లబ్ధి కూడా అందుతోంది. దీంతో మేము ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. – కత్తి లక్ష్మిదేవి, బుగ్గలేటిపల్లె, చింతకొమ్మదిన్నె మండలం

తెగుళ్ల కాలం.. అప్రమత్తతే ఆయుధం

గత రెండు నెలలుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వలన ఉద్యాన పంటలు ఆశించిన మేర ఎదుగదల లేవని దీంతో పాటు తెగుళ్లు ఆశిస్తున్నాయని వైఎస్సార్ జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐజే మైఖేల్ రాజీవ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. – కడప అగ్రికల్చర్



మిరపపంట..

ఈ ఏడాది మిరపపంట నాటిన తొలిదశలోనే బెట్టుకు గురైంది. దీంతో మిరపపంట ఆశించిన మేర పెరగలేదు. దీంతోపాటు అంతర్‌కృషిగా ఎరువులు వేసేందుకు పరిస్థితులు అనుకూలించడం లేదు. ఈ వర్షాభావ పరిస్థితుల(బెట్టు) వలన రసం పీల్చు పురుగులైన తామర పురుగు, తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంది. దీంతో వైరస్ తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుంది.

- ఈ బెట్టు పరిస్థితులలో మొక్కలు భూమి నుంచి పోషకాలు తీసుకోలేవు. ఈ పరిస్థితిని అధిగమించి మిరప మొక్కలు ఎదుగుదల పెంచేందుకు యూరియా 10–20 గ్రాములు/పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు/స్థూల పోషకాల మిశ్రమం (19–19–19) 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒక్కసారి పిచికారి చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలు అందించాలి. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే సూక్ష్మ పోషకాల లోపాలను సవరించవచ్చు. తద్వారా దృఢంగా, ఆరోగ్యవంతంగా పెరిగిన మొక్కలు
- రసం పీల్చు పురుగుల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులును తట్టుకొనే శక్తిని కలిగి ఉంటాయి.
- మొక్కల వరుసల మధ్య గొర్రు వేసి గుంటకలతో నేలను చదువు చేసి నేలలో తేమ ఆరిపోకుండా చూడాలి
- ఏదైనా సందర్భంలో వర్షం పడినట్లయితే వెంటనే పైపాటుగా ఎకరానికి 65 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. అదే విధంగా నీటి వసతి అందుబాటులో ఉన్నప్పుడు కూడా పైన తెలిపిన ఎరువులను నాటిన 90 రోజులకు ఒకసారి, 120 రోజులకు ఒకసారి వేసుకోవాలి
- ప్రస్తుత బెట్ట పరిస్థితులలో రసం పీల్చు పురుగులైన తామర, తెల్లదోమ పురుగులతో పాటు గత రెండు సంవత్సరాలుగా మిరప పంటను నష్టపరుస్తున్న నల్లతామర పురుగు కూడా ఆశించేందుకు అవకాశం ఉంది.
- నల్లతామర పురుగులు ఆకుల మీద, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో చేరి పత్ర హరితం గీకి వేయడం, రసం పీల్చడం ద్వారా కణజాలం దెబ్బతింటుంది. దీంతో ఆకులు మాడిపోయినట్లు కనిపించడం, పువ్వులు గోధుమ రంగులోకి మారి రాలిపోవడం జరుగుతుంది. పిల్ల పురుగులు కాయ తయారయ్యే దశలో ఎక్కువగా లేతకాయల మీద ఆశించి రసం పీల్చడం ద్వారా కాయలు గట్టిగా గిడసబారి ఇటుకరాయి రంగులోకి మారిపోతాయి.
- రైతులు సామూహికంగా నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 40–50 వరకు, పసుపురంగు అట్టలను ఎకరానికి 10–20 వరకు మొక్క ఎత్తుకు దగ్గరగా పెట్టుకోవడం ద్వారా నల్లతామర పురుగు, తెల్లదోల ఉధృతిని తెలుసుకుని సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టవచ్చు.
- వేప నూనెను సిఫారసు చేసిన ఇతర మందులతో కూడా కలిపి పిచికారీ చేసుకోవచ్చు.
- విచక్షణారహితంగా తక్కువ వ్యవధిలో సిఫారసు చేయని పురుగు మందులను వాడరాదు
- తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు/ థయోమిథాక్సమ్ 0.4 గ్రాములు/ డైఫెన్ థియోరాన్ 1.25 గ్రాములు/ స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి
- నల్లతామర పురుగు నివారణకు ఎకరానికి బ్రోఫ్లనిలైడ్ (20 ఎ.సి) 34 మిల్లీలీటర్లు/ ఫ్లక్సామెటామైడ్ (20 ఎ.సి) 160 మిల్లీలీటర్లు/ ఐసోసైక్లోసెరం 240 మిల్లీలీటర్లు/ పిప్రోనిల్ (80 డబ్ల్యూజీ) 40 గ్రాములు / ఫిప్రొనిల్ 5 శాతం ఎస్‌సి 400 మిల్లీలీటర్లు/స్పైరోటెట్రామాట్ (15.30 శాతం జీడీ) 200 మిల్లీలీటర్లు/ థయోమిథాక్సమ్ 80 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలి.
- అవసరాన్ని బట్టి పైన సూచించిన పురుగు మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకుని పురుగుల ఉధృతిని అదుపులో ఉంచుకోవాలి.
- ఈ జాగ్రత్తలు పాటించి మొక్కలను 20 నుంచి 25 రోజుల వరకు బెట్టు నుంచి కాపాడుకోవచ్చు.



ఉల్లి పంటకు...

- బెట్టు పరిస్థితులలో పంట ఎదుగుదల సరిగా లేనట్లయితే నీటిలో కలిగే ఎన్‌పీకే ఎరువులు 19–19–19 ఎన్‌పీకే 5 గ్రాములు ఒక నీటరు నీటికి లేదా 13–00–45 5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా యూరియా 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- మొక్కలు ఏపుగా పెరిగే దశలో త్వరగా కోలుకోవడానికి సల్ఫర్ 85 శాతం డబ్ల్యూపీ : 1.5–2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి ఆకుల మీద పిచికారీ చేయాలి.
- అధిక ఉష్ణోగ్రత సమయంలో లీఫ్ మైనర్‌ను నియంత్రించడానికి వేప సబ్బు 4 గ్రాములు లీటరు లేదా ఎసిటామిప్రిడ్ 0.5 గ్రాములు లీటరు చొప్పున పిచికారీ చేయాలి.

చీనీ, నిమ్మ...

- చీనీ నిమ్మ తోటలో సున్నితమైన పూత– పిందె దశ మరియు కాయ పెరిగే దశలతో తప్పని సరిగా నీటిని అందించినట్లయితే కాయ దిగుబడి తగ్గకుండా పంటను కాపాడుకోవచ్చు.
- పిందె రాలడాన్ని నివారించడానికి 2.4–డి : 1 గ్రాము లేదా ప్లానోఫిక్స్ : 25 మిల్లీలీటరు హార్మోను మందును 100 లీటర్లు నీటిలో కలిపి బఠాని సైజు పిందె దశలో ఒకసారి, గోళీ కాయ దశలో మరోసారి చివరగా కాయ కోతకు ఒక నెల రోజుల ముందు ఒకసారి పిచికారీ చేసుకోవాలి.
- వర్షాభావ పరిస్థితులలో కాయ సైజు, జ్యూస్ శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ (13–0–45) : 10 గ్రాములు లీటరు నీటికి కలిపి కాయ పెరిగే దశలో పిచికారీ చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచించారు.

భర్త చేతిలో భార్య హతం

సయోధ్యకు రమ్మని పిలిచి తుదముట్టించాడు



హత్యకు గురైన మహిళ

రాయచోటిటౌన్ : భర్త చేతిలో భార్య హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి రాయచోటి పట్టణ శివార్లలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం గరుగుపల్లెకు చెందిన వెంకటరమణ వీరబల్లి మండలం మట్లి గ్రామానికి చెందిన రేవతి(25)ని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండు నెలల క్రితం నుంచి భార్యపై భర్తకు అనుమానం మొదలైంది. ఈ నేపథ్యంలో ఆమె భర్తతో విభేదించి పుట్టింటికి వెళ్లింది. అలాగే తన భర్త తనను అనుమానించి వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకటరమణ వృత్తి రీత్యా తాపీ మేస్త్రీగా పని చేస్తుంటాడు. కాగా, ఆమె ఇటీవల రాయచోటి పట్టణంలో ఓ షాపింగ్ మాల్‌లో పని కుదుర్చుకుంది. విషయం తెలుసుకున్న భర్త బుధవారం రాత్రి ఆమెకు ఫోన్ చేసి బయటకు రా...నీతో మాట్లాడాలని సయోధ్యకు పిలిచాడు. ఆమెను బైకుపై రాయచోటి – గున్నికుంట్ల రోడ్డులోని రింగ్ రోడ్డు వైపు, అక్కడి నుంచి మళ్లీ చిత్తూరు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీ నిర్మాణాల దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో భార్యను ఆమె చున్నీతోనే మెడకు గట్టిగా చుట్టి హత్య చేశాడు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మన్నికలో మేటి భారతి సిమెంట్



రామసముద్రంలో తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలు అందజేస్తున్న టెక్నికల్ మేనేజర్, మార్కెటింగ్ ఆఫీసర్

రామసముద్రం : నాణ్యత మన్నికల్లో భారతి అల్ట్రాఫా సిమెంట్ మేటి అని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి, మార్కెటింగ్ ఆఫీసర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. రామసముద్రంలో తాపీ మేస్త్రీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ ప్రజల విశ్వాసాన్ని పొందిందని, అత్యాధునిక పరిజ్ఞానంతో తయారైన ఈ సిమెంట్ వాడకంతో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. మిగిలిన సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్ తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందన్నారు. వినియోగదారులకు సాంకేతిక సాయాన్ని, బీమా పత్రాలను తమ సంస్థ ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయలు ఉచిత బీమా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు భాస్కర్‌గౌడ్, మధు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అదృశ్యమైన మూడురోజుల తర్వాత శవమయ్యాడు



వాగులో లభ్యమైన బాలకృష్ణ మృతదేహం

బి.కొత్తకోట : మోటార్లు రిపేరు చేసే మెకానిక్ మూడురోజుల క్రితం అదృశ్యమై నాలుగోరోజు శవమై కనిపించాడు. గురువారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు... బి.కొత్తకోట వాయలవంకకు చెందిన కె.బాలకృష్ణ(38), కె.శ్రీదేవి భార్యాభర్తలు. బాలకృష్ణ మెకానిక్‌గా పనిచేస్తుండగా, శ్రీదేవి ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా కుటుంబంలో చిన్నచిన్న గొడవలు చోటు చేసుకుంటున్నాయి. బాలకృష్ణ మద్యం సేవించడం, మెకానిక్ పని సక్రమంగా చేయకపోవడంతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఈనెల 13న బాలకృష్ణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ పరిస్థితుల్లో గురువారం ఉదయం బి.కొత్తకోట సమీపంలోని ఆలేరువాగులో బోర్లా పడిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి బాలకృష్ణగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని భార్య శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలకృష్ణ సక్రమంగా పనిచేసేవాడు కాదని, మద్యం సేవిస్తూ గొడవపడేవాడని, చిన్న చిన్న కారణాలతో విభేదించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ చెప్పారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్‌ఐ చెప్పారు. మృతిపై అనుమానాస్పద కేసు నమోదైంది. అదృశ్యమైన మృతుడు మూడురోజుల పాటు ఎక్కడున్నాడు? వాగులో పడి ఎలా చనిపోయాడు? వాగులో పడే ముందు ఏమైనా సంఘటనలు జరిగాయా? ఆ సమయంలో ఎవరైనా ఉన్నారా? ప్రమాదవశాత్తు వాగు నీటిలో పడి మరణించాడా, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని ఏఎస్‌ఐ చెప్పారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు



అనసూయాదేవి(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో అనసూయాదేవి అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌బాబు సమాచారం మేరకు అనసూయాదేవికి కొంత కాలంగా మతిస్థిమితం లేదు. ఈనెల 14వ తేదీన ఆమె భర్త రమణారెడ్డి కడపకు ఆసుపత్రికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య కనిపించ లేదు. వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైకు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె సిటీ : బైక్ చోరీ చేసిన నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన మహమ్మద్ యూనస్ సమీర్(23)ను నక్కలదిన్నె ఆర్చి వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.50 వేలు విలువ చేసే మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంటి ముందు పెట్టిన ద్విచక్రవాహనాలకు హ్యాండ్‌లాక్‌తో పాటు ఫోర్క్ లాక్ కూడా వేసుకోవాలని సీఐ సూచించారు.

పీలేరు డీఎఫ్‌ఓగా జె.వి.సుబ్బారెడ్డి



పీలేరు : పీలేరు సంచారదళ నిఘా విభాగం అధికారిగా (డీఎఫ్‌వో)గా జె.వి.సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలో విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న సుబ్బారెడ్డి పదోన్నతిపై పీలేరుకు వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిత్తూరు జిల్లా బాలుర జట్టు ఎంపిక

వాల్మీకిపురం : స్థానిక జీవీఎస్‌సీఎస్ క్రీడా మైదానంలో అండర్–19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక గురువారం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నలుమూలల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ చూపిన 32 మందిని ఎంపిక చేశామని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జయరామయ్య తెలిపారు. మూడు రోజులు పోటీలు నిర్వహించిన అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే క్రికెట్ పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, ఖాదర్‌బాబా, లాల, నాగరాజు, నరేష్, రియాజ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన రాళ్లపల్లి కృష్ణయ్య నాయుడు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై గురువారం దేవపట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాళ్లపల్లి కృష్ణయ్య నాయుడు (56) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు రెడ్డివారిపల్లి పంచాయతీ, నడిమిరాజుగారిపల్లికి చెందిన కృష్ణయ్య నాయుడు సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో దేవపట్లకు బయలుదేరాడు. తిరుపతి డిపోకు చెందిన ఎయిర్ బస్ తిరుపతి నుంచి రాయచోటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో కృష్ణయ్య నాయుడు గాయపడ్డాడు. క్షతగాత్రుడని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నా కుమారుడిని అన్యాయంగా ఇరికించారు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 12న రాత్రి పాతబైపాస్ రోడ్డులో అమృత్ టీస్టాల్‌లో సాయికిరణ్ అనే యువకుడిని హత్య చేసిన సంఘటనలో తన కుమారుడు శ్రీరామ్‌ను అన్యాయంగా రెండవ నిందితుడిగా చేర్చారని అతని తల్లి సుభద్ర ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చావుబతుకుల మధ్య ఉన్న సాయికిరణ్‌ను తన కుమారుడు ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అయితే ఈ హత్య కేసులో రెండవ నిందితుడిగా చేర్చడం అన్యాయమన్నారు. పోలీసులు పునః పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనపై చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డిని విలేకరులు వివరణ కోరగా, ఈ సంఘటనలో హత్యకు గురైన సాయికిరణ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ సంఘటనలో సరైన ఆధారాలను సేకరించిన తరువాతనే శ్రీరామ్‌ను రెండవ నిందితుడిగా చేర్చామన్నారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో కొండ చిలువ

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కొండచిలువ కలకలం రేగింది. గురువారం బాయ్స్ హాస్టల్–2లోకి భారీ కొండ చిలువ వచ్చింది. మంచం కింద దూరి ఉండటం గమనించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీ అధికారులకు తెలిపారు. వేంపల్లె ఫారెస్ట్ అధికారులకు ట్రిపుల్ ఐటీ అధికారులు సమాచారం ఇవ్వంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కొండ చిలువను గోనె సంచిలో బంధించారు. బంధించిన కొండ చిలువను ఫారెస్ట్ జీపులో దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. హాస్టల్ గదిలోకి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.